మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
గురువారం 17 సెప్టెంబర్ 2026 పేజీలు : 10

# సమాజంలో మార్పు 'త్రిశూల్ - యువ చైతన్యం' తోనే సాధ్యం

## విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపీఎస్

**విజయనగరం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** యువతలో స్ఫూర్తి నింపడంతోపాటు, వారిని సన్మార్గంలో నడిపించేందుకు, యువతే సారథులుగా క్షేత్ర స్థాయి లో ప్రజల్లో మార్పు తీసుకొని వచ్చేందుకు విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపీఎస్ వినూత్నంగా చేపట్టిన 'త్రిశూల్ - యువ చైతన్యం' కార్యక్రమాన్ని సెప్టెంబరు 16న ఎస్.కోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ ముఖ్య అతిధిగా హాజరై, యువతతో మమేకమయ్యారు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - యువత తలచుకొంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. చైతన్యవంతమైన యువతి, యువకులతో ప్రజల్లో మార్పు తీసుకొని రావచ్చునన్నారు. యువతే సారథులుగా గ్రామాల్లో దురలవాట్లు రూపుమాపేందుకు, ప్రజల్లో చైతన్య తీసుకొని వచ్చేందుకు "యువ చైతన్యం" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అదే విధంగా ప్రభుత్వం కూడా 'త్రిశూల్'అనే కార్యక్రమంతో రాష్ట్రాన్ని గంజాయి మరియు డ్రగ్స్ రహితం చేసేందుకు, మహిళలు, రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టనున్నదని జిల్లా ఎస్పీ తెలిపారు. యువత ఎవరైనా గంజాయి, డగ్స్ వినియోగించినా, విక్రయించినా, రవాణకు పాల్పడినా



2వ పేజీలో

### ప్రజలను జాగృతం చేయడంలో
# మీడియాది కీలక భూమిక : గంటా



**భీమునిపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** సమాజంలో అసమానతలు తొలగించి ప్రజలను జాగృతం చేయడంలో మీడియా ప్రధాన భూమిక పోషిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. భీమిలి ఉమర్ ఆలీషా ఆశ్రమంలో బుధవారం జరిగిన భర్తీ శ్రమజీవి పత్రకార్ సంఘ్ (బి.ఎస్.పి.ఎస్.) 13 వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల వృత్తి జీవితం కత్తి మీద సాములా మారిందని, వారిపై దాడులకు సైతం విద్రోహ శక్తులు తెగబడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు మీడియా విశేష కృషి చేస్తోందని, నైతిక విలువలు కాపాడుతూ ముందుకు వెళ్లాలని జర్నలిస్టులకు సూచించారు. భాగల్ పూర్ లో పోలీసుల క్రూరత్వంపై పాత్రికేయుడు అరుణ్ శౌరీ కథనాలు ప్రభుత్వాన్ని కదిలించాయన్నారు. రాజకీయాల్లోకి రాకముందు రెండేళ్లు డెక్కన్ క్రానికల్ లో పనిచేసిన సమయంలో తాను జర్నలిజానికి చాలా దగ్గరగా ఉన్నానని వెల్లడించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఉమర్ అలీషా, మాట్లాడుతూ మానవత్వంతో సమాజానికి సేవలు అందించే

2వ పేజీలో

# వైసీపీలోకి మళ్లీ
# మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్..??

### భీమిలి ఇన్ ఛార్జ్ బాధ్యతలు ఇచ్చే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం

**భీమునిపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** భీమిలి నియోజకవర్గ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావు తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇటీవల భీమిలి వైసీపీ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరడంతో నియోజకవర్గంలో నాయకత్వ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో భీమిలిపై పట్టున్న బలమైన నేత అవంతి శ్రీనివాస్ అయితేనే పార్టీని ఏకతాటిపైకి తెచ్చి



అధికార కూటమిని ఢీకొట్టగలరని మెజారిటీ స్థానిక నేతలు, కార్యకర్తలు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నారు.? గతంలో వైయస్సార్సీపినీ వీడినప్పటికీ వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

# సమాజంలో మార్పు 'త్రిశూల్ - యువ చైతన్యం' తోనే సాధ్యం




**ఒకటి తరువాయి** తీవ్రమైన కేసులో నిందితులుగా అరెస్టుకావడంతో భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. మంచి పౌరునిగా మహిళలు, బాలల భద్రతకు, రక్షణకు ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందన్నారు. చదువుకొనే వయస్సులో ఆకర్షణలకు లోనుకావద్దని, లక్ష్యంతో చదువుకొని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మహిళలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టడం, వారి గౌరవాన్ని భంగం కలిగించే విధంగా ఫోటోల మార్ఫింగుకు పాల్పడడం, లైంగిక వేధింపులకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. యువత సన్మార్గంతో నడవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేసారు. రహదారి ప్రమాదాల నియంత్రణలో యువత భాగస్వామ్యులు కావాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. అమ్మ జన్మనిస్తే, హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాల నుండి పునర్జన్మ ఇస్తుందన్నారు. అతివేగం వద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. వాహనాలు నడవడంలో నిర్లక్ష్యం కారణంగా రహదారి ప్రమాదాల్లో మరణిస్తే వారి కుటుంబాలు ఇంటి పెద్దను కోల్పోయి, ఆర్థికంగా నష్టపోవడంతోపాటు పిల్లల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్లు, లింకులకు స్పందించ వద్దని, అనుమానాస్పద యాప్లు, ఆన్లైన్ పెట్టుబడులు, ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే సైబరు నేరగాళ్ళ ప్రలోభాలకు లొంగొద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయాలన్నారు. యువతే సారథులుగా, ప్రజలు - పోలీసుల (చట్టాల) మధ్య సంధానకర్తలుగా వ్యవహరించి, నేరరహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యులు కావాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. అనంతరం, యువతతో గంజాయికి దూరంగా ఉంటామని జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘువులు, ఎస్. కోట సిఐ వి.నారాయణ మూర్తి, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఎ.వి.లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# వైసీపీలోకి మళ్లీ మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్..??

**ఒకటి తరువాయి** నియోజకవర్గం లో ఆయనకున్న బలమైన వర్గం, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఉన్న సుదీర్ఘ అనుబంధం పార్టీ పునర్నిర్మాణానికి ఉపకరిస్తుందని భావిస్తున్న అధిష్ఠానం ఆయనకే తిరిగి భీమిలి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించే దిశగా యోచిస్తోంది. వైసీపీలోని కొందరు సీనియర్ నేతల నుంచి ఆయన చేరికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, నియోజకవర్గంలో పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధిష్ఠానం సానుకూలంగానే ఉన్నట్లు సమాచారం. అవంతి రీ-ఎంట్రీ ఖాయమైతే భీమిలి వైసీపీలో కొత్త ఉత్సాహం రావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మీడియాది కీలక భూమిక : గంటా

**ఒకటి తరువాయి** పత్రికలు తమ ఆశ్రమానికి రావడం వారితో గడపడం మర్చిపోలేని అనుభూతిగా చెప్పారు. రాష్ట్ర నవ్యాంధ్ర జర్నలిస్ట్ సంఘం ప్రెసిడెంట్ సూరంపూడి వీరభద్రరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం బలోపేతానికి నీతివంతమైన మీడియా అనే అంశంపై 20 మందితో చర్చ గురువారం నిర్వహిస్తున్నామని చెప్పారు. జాతీయ నాయకులు గిరిధర శర్మ గ్రామీణ పాత్రికేయులు కు జీతాలు ఇవ్వకపోగా డబ్బులు తెమ్మని పత్రిక యాజమాన్యాలు టార్గెట్స్ దారుణమని చెప్పారు. షానవాజ్ చిన్న పత్రిక సంఘం జగన్మోహన్ రావు జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ట్రస్టీ చెరువు రామకోటయ్య, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, బి.ఎస్.పి.ఎస్. రాష్ట్ర అధ్యక్షుడు సూరంపూడి వీరభద్రరావు, డాక్టర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# గొలుగొండ అంబేద్కర్ గురుకులంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర ఆకస్మిక తనిఖీ

**- గురుకుల భోజన నాణ్యత లోపించడం, మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంపై చర్యలకు జిల్లా కోఆర్డినేటర్‌కు సిఫార్సు**
**- భోజనంలో నాణ్యత లేకుంటే సహించేది లేదు: సూర్యచంద్ర**

**గొలుగొండ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** గొలుగొండ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలను జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్య చంద్ర మంగళవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీడీవో ఎంఎస్ శ్రీనివాస్, ఎంఈఓ సత్యనారాయణ, ఇతర అధికారులతో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలి ంచారు. అనంతరం వంటశాల ను తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిం చారు. భోజనంలో నాణ్యత లోపిం చిందని, మెనూ సక్రమ ంగా అమలు చేయకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా భోజనం తయారు చేస్తున్న వంట సిబ్బందిని మందలించారు. వంటల నాణ్యతలో నిర్లక్ష్యం,



మెనూ సక్రమంగా అమలు చేయక పోవడంపై నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సూర్యచంద్ర జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణకు సిఫార్సు చేశారు. దీనిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కోఆర్డినేటర్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అనంతరం సూర్యచంద్ర వంటల నాణ్యత విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా తాను ఇటీవలే విధుల్లో చేరానని, వంటలో నాణ్యత లోపిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, గతంలో మెమోలు ఇచ్చిన వీళ్ళ పద్ధతి మారలేదన్నారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, పరిశుభ్రత కూడా లోపించిందని సూర్యచంద్ర పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గండెం దొరబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్‌బాబు, దేవి, మండల ఎస్సీ సెల్ నాయకుడు బోయిన చిరంజీవి పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలపై సమీక్ష

**రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో రమణబాబు సమావేశం**

**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలపై ఎంపీడీవో రమణబాబు ఆధ్వర్యంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిం చారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటి వివరాలు, ఓటర్లకు అందుబాటులో ఉండాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను ముందుగానే పరిశీలించాలన్నారు.ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు సులభంగా చేరుకునేలా పరిస్థితులను పరిశీలించాలని రాజకీయ పార్టీల నాయకులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పోలింగ్ కేంద్రాల ఎంపిక, మార్పులు లేదా ఇతర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా అధికారులు తెలుసు కున్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత వాతావరణం ఉండేలా అన్ని



రాజకీయ పార్టీలు అధికారులకు సహకరించాలని సమావేశంలో సూచించారు.


పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, రాకపోకలకు అనుకూలమైన వాతావరణం వంటి ప్రాథమిక సౌకర్యాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అంశంపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో కూటమి నాయకులు వీర వెంకట్, నాగమణి, చిరంజీవి, బాలు, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకువ చ్చారు. మండలంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల పరిస్థితులను పరిశీలిస్తూ అవసరమైన చర్యలను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# అత్యంత వేగంగా విజయవంతమైన వందకు పైగా బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంటేషన్స్ చికిత్సలు

**- హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్, విశాఖపట్నంలో 100కు పైగా బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్లు పూర్తి చేసి, క్యాన్సర్ సంరక్షణలో సరికొత్త మైలురాయి సాధించినది**


**- హెచ్‌సిజి అధునాతన క్లినికల్ మౌలిక సదుపాయాలు, ప్రత్యేక వైద్య నైపుణ్యతలు కలిగి సంక్లిష్టమైన క్యాన్సర్ మరియు నాన్ క్యాన్సర్ ఉత్తమ ఫలితాలు అందిస్తున్నాది**

**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** స్థానిక APIIC హెల్త్ సిటీ ఉన్న బ్లడ్ క్యాన్సర్ సరక్షణలో పేరొందిన హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ 100కు పైగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్లు చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి ప్రాంతీయ క్యాన్సర్ సంరక్షణలో ఒక మైలురాయిని సాధించినది. అధునాతన హెమటాలజీ సమస్యల పరిష్కారానికి ఒక ప్రముఖ తృతీయ రెఫరల్ కేంద్రంగా ఎజ+ అభివృద్ధికి ఇది నిదర్శనం. ఈ కేంద్రం వలన కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, ఛత్తీస్గఢ్, అండమాన్ మరియు పొరుగు ప్రాంతాలలోని రోగులు సంక్లిష్టమైన, అధిక-ప్రమాదకరమైన చికిత్స కొరకు సుదూర ప్రాంతంలోని మెట్రో నగరాలకు వెళ్ళే ఆవశ్యకత తగ్గుతుంది అని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రసాద్, COO, హెచ్‌సిజి వైజాగ్, డాక్టర్ భాస్కర్ భువన్, హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ నవీన్ రామచంద్ర నాగర్, క్లినికల్ స్ట్రాటజీ �a క్లినికల్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ SVP హెడ్, హెచ్‌సిజి సెంటర్, డాక్టర్ లక్ష్మీ మైథిలి, కన్సల్టెంట్ హెమటో-ఆంకాలజిస్ట్, హెచ్‌సిజి పాల్గొన్నారు. హెచ్‌సిజి ఈ మైలురాయి సాధించిన సందర్భంగా డాక్టర్ వైద్యుడు ప్రసాద్, COO, హెచ్‌సిజి, వైజాగ్ వారు మాట్లాడుతూ “మా విశాఖపట్నం కేంద్రంలో 100-బిఎమ్‌టి మైలురాయిని సాధించటం గర్వకారణం అన్నారు. ఈ ప్రాంతానికి తృతీయ స్థాయి బ్లడ్ క్యాన్సర్ సంరక్షణను అందించాలన్న మా లక్ష్యానికి నిదర్శనం అన్నారు. కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని రోగులు కీలకమైన స్టెమ్ సెల్ ప్రక్రియల కోసం సుదూర మెట్రో నగరాలకు వెళ్ళే ప్రయాసలను తగ్గించటానికి కృషి చేస్తున్నాము. అంతేకాక రోగులకు చేరువలోనే అధునాతన సాంకేతికత వైద్యం అందించుటలో హెచ్‌సిజి కృషిని ఈ మైలురాయి స్పష్టం చేస్తుంది అన్నారు. ఈ 100కు పైగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్లు చికిత్సల వెనుక యాంటిసెప్టిక్ ఐసోలేషన్ ప్రోటోకాల్‌లు, వేగవంతమైన రోగ నిర్ధారణ ఫలితాలు, మార్పిడి అనంతర ప్రత్యేక నర్సింగ్ సంరక్షణ వంటి అంశాలతో కూడిన వైద్యపరమైన సంరక్షణ ఉంటుంది. మా వైద్య బృందం ప్రధాన దృష్టి రోగి భద్రత, కార్యాచరణ, చికిత్సా కాలంలో అవాంతరాలు లేని అనుభవాన్ని అందించడంపైనే కేంద్రీకృతమై ఉంటుంది అన్నారు డాక్టర్ ప్రసాద్ (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ , హెచ్‌సిజి సెంటర్. బోన్ మ్యారో స్టెమ్ సెల్ యొక్క సంక్లిష్టత కేవలం ఆ ప్రక్రియకే పరిమితం కాదు. దీనికి మార్పిడికి ముందు శరీరాన్ని సిద్ధం చేయడం (ప్రీ-ట్రాన్స్‌ప్లాంటేషన్ కండిషనింగ్), అధిక మోతాదు కీమోథెరపీ, మూల కణాల ప్రాసెసింగ్, మరియు గ్రాఫ్ట్-వర్సెస్-హోస్ట్ వ్యాధి మరియు అవకాశవాద ఇన్ఫెక్షన్లను నివారించడానికి మార్పిడి తర్వాత కఠినమైన పర్యవేక్షణ కోసం ప్రత్యేక క్లినికల్ మౌలిక సదుపాయాలు అవసరం. ఈ క్లిష్టమైన దశలను విజయవంతంగా అధిగమించడంలో హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ విశాఖపట్నం సాధించిన విజయం, దాని సమీకృత రోగ నిర్ధారణ వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడి ఉంది. ఈ వ్యవస్థలో అత్యాధునిక ఫ్లో సైటోమెట్రీ, మాలిక్యులర్ డయాగ్నోస్టిక్స్, మరియు వేగవంతమైన బ్లడ్ బ్యాంక్ సేవలు ఉన్నాయి. ‘100కు పైగా విజయవంతమైన స్టెమ్ సెల్ మార్పిడులను సాధించడం అనేది మా క్లినికల్ సామర్థ్యత, పటిష్టమైన కార్యాచరణ వ్యవస్థకు, అత్యాధునిక సాంకేతికతకు నిదర్శనం మరియు సమగ్రమైన క్యాన్సర్ హాస్పిటల్ గా హెచ్‌సిజి ఈ ప్రాంతంలో అధునాతన




క్యాన్సర్ సంరక్షణకు ప్రధాన గమ్యస్థానంగా నిలుస్తూ, రోగి భద్రతలో ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ విజయవంతమైన మైలురాయిని సాధించినందుకు బృందాన్ని అభినందిస్తున్నాను అన్నారు డాక్టర్ నవీన్ రామచంద్ర నాగర్, క్లినికల్ స్ట్రాటజీ & క్లినికల్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ SVP హెడ్, హెచ్‌సిజి సెంటర్. ఈ విజయం గురించి హెచ్‌సిజిక్యాన్సర్ సెంటర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ భువన్ మాట్లాడుతూ మా వైద్య సిబ్బంది క్లినికల్ కచ్చితత్వానికి, వివిధ విభాగాల సమన్వయానికి, మరియు అలుపెరుగని అంకితభావానికి ఈ విజయం నిదర్శనం అన్నారు. ఆధునిక ఆంకాలజీలో ఎముక మజ్జ మార్పిడి అత్యంత క్లిష్టమైన ప్రక్రియలలో ఒకటి. దీనికి హెమటాలజిస్టులు, ట్రాన్స్‌ఫ్యూజన్ నిపుణులు, ఐసియు బృందాలు, మరియు ప్రత్యేక శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బంది మధ్య చక్కని సమన్వయం ఉండాలి అన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి మైథిలి మూలం, కన్సల్టెంట్ హెమటో-ఆంకాలజిస్ట్, హెచ్‌సిజి వారు హెమటో-ఆంకాలజీ సంరక్షణ మరియు చికిత్స గురించి మాట్లాడుతూ “సంక్లిష్టమైన రక్త సంబంధిత రుగ్మతలు, ముఖ్యంగా పిల్లల కేసులలో, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలకు తగిన ప్రత్యేక ప్రోటోకాల్‌లు అవసరమని, హెచ్‌సిజి నందు అంకితమైన హెమటో-ఆంకాలజీ వ్యవస్థ, ఖచ్చితమైన ఇన్ఫెక్షన్ నియంత్రణ, మార్పిడి తర్వాత సంరక్షణ కలిగి స్టెమ్ సెల్ మార్పిడులను అందించడానికి వీలు కల్పిస్తుంది అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఈ అధునాతన చికిత్సలకు లభించటం వలన సామాజిక-ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా తీవ్రమైన రక్త రుగ్మతలపై చికిత్స పొందే అవకాశం ప్రతి రోగికి లభిస్తుంది అని చెప్పారు. హెచ్‌సిజి సెంటర్ నందు హెమటో-ఆంకాలజీ మరియు బోన్ మ్యారో స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్, అనేక రకాల సంక్లిష్టమైన అక్యూట్ మరియు క్రానిక్ లుకేమియాలు, హాడ్కిన్స్ మరియు నాన్-హాడ్కిన్స్ లింఫోమాలు, మల్టిపుల్ మైలోమా, తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియా, మరియు తలసేమియా వంటి హెమటాలజికల్ మాలిగ్నెన్సీలు మరియు నాన్-మాలిగ్నెంట్ రక్త రుగ్మతలకు చికిత్స అందిస్తుంది. ప్రత్యేకమైన HEPA-ఫిల్టర్డ్ పాజిటివ్-ప్రెజర్ ఐసోలేషన్ సూట్‌లు, కఠినమైన ఇన్ఫెక్షన్-నియంత్రణ మౌలిక సదుపాయాలు మరియు 24/7 క్రిటికల్ కేర్ బ్యాకప్‌తో కలిగి, రోగి సొంత ఆరోగ్యకరమైన మూలకణాలను ఉపయోగించి ఆటోలోగస్ మార్పిడులను, అలాగే సరిపోలిన సంబంధిత లేదా సంబంధం లేని దాతల నుండి చేసే అలోజెనిక్ మార్పిడులను క్రమం తప్పకుండా నిర్వహిస్తుంది. హెచ్‌సిజి క్యాన్సర్ సెంటర్ విశాఖపట్నం తన సమగ్ర బహుళ-విభాగాల వ్యవస్థను పటిష్టంగా సర్జికల్ ఆంకాలజీ, ప్రెసిషన్ రేడియేషన్ థెరపీ, మెడికల్ ఆంకాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ మరియు ప్రత్యేక పునరావాస సేవలు అన్ని ఒకే చోట అందే విధంగా కృషి చేస్తున్నాది.




## నాలుగో బ్యాచ్ ఈఎంబీఏ ప్రారంభం నేడు..!

**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆనందపురం మండలం గంభీరం క్యాంపస్ లో ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఈఎంబీఏ) నాలుగో బ్యాచ్‌ను సెప్టెంబర్ 17న ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ముందుగా ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ మాజీ చైర్మన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ (హెచ్‌ఆర్) రాజ్ దూబే, ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మధ్య ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించనున్నారు. అనంతరం విలేకరుల సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, డైరెక్టర్ కలిసి ఈఎంబీఏ కార్యక్రమాన్ని ఆవిష్కరించనున్నారు. విలేకరుల సమావేశంలో ఈఎంబీఏ కార్యక్రమం, ఐఐఎం విశాఖపట్నం భవిష్యత్ ప్రణాళికలు, వ్యూహాత్మక దృష్టి, ఈఎంబీఏ కార్యక్రమం రూపకల్పన--పరిణామం, మేనేజ్‌మెంట్ మరియు ఎగ్జిక్యూటివ్ విద్యకు ప్రముఖ కేంద్రంగా ఎదిగే లక్ష్యాలు తదితర అంశాలను ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ వివరించనున్నారు. ఈఎంబీఏ కార్యక్రమం దీర్ఘకాలిక ప్రణాళిక, ఐఐఎం విశాఖపట్నం మొత్తం విద్యా ప్రణాళికలో దాని పాత్రపై కూడా సమావేశంలో చర్చించనున్నారని నిర్వాహకులు తెలిపారు.

# కాశీపురం లో డ్రైనేజీ సమస్య పరిశీలన..త్వరలో పరిష్కరిస్తామన్న నేతలు

**దేవరాపల్లి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** కాశీపురం పంచాయతీ పరిధిలోని ప్రధాన వీధిలో ఏళ్లుగా వేధిస్తున్న డ్రైనేజీ, మురుగు నీటి సమస్య పరిష్కారానికి అధికారులు, తెలుగుదేశం పార్టీ నేతలు కలిసి చర్యలు చేపట్టారు.బుధవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, దేవరాపల్లి మండల పూర్వపు అధ్యక్షుడు, ప్రస్తుత రావికమతం తెదేపా పరిశీలకుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి. అనంత ఉమాదేవి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తో కలిసి సమస్యాత్మక వీధిని పర్యవేక్షించారు. గత కొంత కాలంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరు రోడ్లపైకి వచ్చి నిలిచిపోతుందని, దీంతో వీధి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు నేతల దృష్టికి తీసుకొచ్చారు.మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి, మలేరియా,



డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని, చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు చేరుతోందని గ్రామస్తులు వాపోయారు.ఈ సమస్యను పరిశీలించిన నేతలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తో కలిసి కొత్త డ్రైన్ నిర్మాణానికి, పూడికతీత పనులకు అంచనాలు తయారు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా చిటిమిరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఈ మురుగు నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, దీనికి సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్యం విషయంలో రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు ఆదిరెడ్డి అక్కుతాత, రైవాడ జలాశయం నీటి సంఘం డైరెక్టర్ బండారు శ్రీరామ్ మూర్తి, ఆదిరెడ్డి అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ డే కార్యక్రమానికి నర్సీపట్నం డిఎస్పీ పి.శ్రీనివాసరావు



**గొలుగొండ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** గొలుగొండ మండం లో గొలుగొండ మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేసిన ఓజోన్ డే కార్యక్రమానికి నర్సీపట్నం డిఎస్పీ పి. శ్రీనివాసరావు హాజరవడం జరిగినది, ముందుగా విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బందితో మానవహారం చేసి, అనంతరం I LOVE SCHOOL నేమ్ బోర్డు ప్రారంభించారు, పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో డి.ఎస్.పి మాట్లాడుతూ పాఠశాల మునుపటి కంటే చాలా ఆహ్లాదకరంగా మొక్కలు పెంపకం, విద్యార్థులు క్రమశిక్షణ ,ఉపాధ్యాయుల నిబద్ధత బాగున్నాయని కొనియాడారు, అలాగే పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని విద్యార్థులందరూ మొక్కలు పెంచడం, ప్లాస్టిక్ వాడుక తగ్గించడం, పర్యావరణాన్ని కాపాడే పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం పాఠశాలకు పోడియం అందించిన రమణి మేడం , జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన బాలకృష్ణ మాస్టర్ గొలుగొండ జడ్పిటిసి గిరిబాబు, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ రమేష్, సబ్ ఇన్స్పెక్టర్ రామారావు,పాఠశాల చైర్మన్ మణికంఠ, ప్రధానోపాధ్యాయులు దాసు, భానోజీరావు , ఉమా అజ్మత్ తో కలిసి సన్మానించారు. అలాగే పాఠశాలకు విచ్చేసిన డీఎస్పీ వారికి పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న గణనాథుని ఉత్సవాలు...!

**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలోని పలుచోట్ల వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజున కూడా భక్తిశ్రద్ధలతో భక్తులు వచ్చి వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ పతివాడ కళ్ళాలు వద్ద ఏర్పాటుచేసిన గణనాథుని విగ్రహానికి జడ్పిటిసి సభ్యుడు కోరాడ వెంకటరావు బుధవారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక చింతన ఉండాలన్నారు. దానితోనే మనకు మానసిక ప్రశాంతత తో పాటు విజయాలు చేకూరుతాయని ఉద్బోధించారు. అనంతరం ఉత్సవ కమిటీకి తనవంతుగా భారీ ధన సహాయం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అతనికి కృతజ్ఞతలు తెలిపారు.

# సిగ్నల్ లేక అల్లాడుతున్న గిరిజన గ్రామం

### దేగలపాలెంకు సెల్ టవర్ మంజూరు చేయాలి : మాజీ సర్పంచ్ రామకృష్ణ



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలో దామనపల్లి పంచాయతీ పరిధిలోని దేగలపాలెం గ్రామంలో సెల్ఫోన్ సిగ్నల్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ సర్పంచ్ కె. రామకృష్ణ తెలిపారు. అత్యవసర సమయాల్లో ఫోన్ చేసుకునే పరిస్థితి లేక విద్యార్థులు, రైతులు, గర్భిణీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. గతంలో జియో టవర్ ఏర్పాటుకు సర్వే నిర్వహించినప్పటికీ నిర్మాణం చేపట్టలేదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని దేగలపాలెంలో తక్షణమే సెల్ టవర్ నిర్మించి సిగ్నల్ సౌకర్యం కల్పించాలని కోరారు. మండలంలోని నెట్వర్క్ సౌకర్యం లేని ఇతర గిరిజన గ్రామాలను గుర్తించి టవర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## విశాఖ మేయర్ మత్స్యకారులకు కేటాయించాలి

### టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి



**భీమునిపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవిఎంసీ ) మేయర్ పదవి కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. రానున్న జీవిఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు పోటీ చేసిన అన్ని వార్డుల్లో బంపర్ మెజారిటీతో గెలిచి క్లీన్ స్వీప్ చేస్తారని అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పేద, మధ్యతరగతి ప్రజలకు అందిస్తున్న సంక్షేమమే అభ్యర్థుల గెలుపుకు నాంది అవుతుందని అన్నారు. జీవిఎంసీ పరిధిలో ఉన్నటువంటి భీమిలి, తూర్పు, దక్షిణం, ఉత్తరం, గాజువాక నియోజక వర్గాల్లో అధికసంఖ్యలో మత్స్యకారులు ఉన్నారని అన్నారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గాన్ని పరిశీలించినా మత్స్యకారుల కుటుంబాలు అధికంగా ఉన్నాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో మత్స్యకారులకు మేయర్ పదవిని కేటాయించడంతో పులుసు జనార్ధన్ జీవిఎంసీ మేయర్ అయ్యారని అన్నారు. జిల్లాలో 80 శాతం మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికే మత్స్యకారులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. మత్స్యకారుల సామాజిక వర్గానికి న్యాయం చేకూరాలంటే వారికి ఉన్నతమైన పదవులలో ప్రాతినిధ్యం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేసారు. ఈ విషయమై విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, భీమిలి, తూర్పు, దక్షణం, ఉత్తరం, గాజువాక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీ కృష్ణ శ్రీనివాస యాదవ్, విష్ణు కుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావులు పునరాలోచన చేయాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు.


# హెల్మెట్ లేని ప్రయాణం..ప్రాణాలకు ప్రమాదం

## వాహనదారులు నిబంధనలు పాటించాలి..రింతాడ కూడలిలో వాహన తనిఖీలు : ఎస్ఐ సురేష్



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడం ప్రాణాలకు ప్రమాదకరమని గూడెంకొత్తవీధి సబ్‌ఇన్‌స్పెక్టర్ సురేష్ వాహనదారులను హెచ్చరించారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాహనదారులు నిబంధనలు పాటించేలా మండలంలోని రింతాడ కూడలి వద్ద బుధవారం పోలీసు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వెనుక కూర్చున్న వ్యక్తులు కూడా హెల్మెట్ ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సురేష్ సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇటీవల వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం కుటుంబాలను విషాదంలోకి నెట్టే అవకాశం ఉన్నందున ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు పత్రం, బీమా తదితర అవసరమైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని ఎస్ఐ తెలిపారు. వాహనాలను నడిపేటప్పుడు రహదారి నియమాలను పాటించాలని, అతివేగానికి దూరంగా ఉండాలని, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. మండలంలోని ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహన తనిఖీలను కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించి రహదారి భద్రతా నిబంధనలను పాటించాలని కోరారు. "హెల్మెట్ భారంగా భావించవద్దు.. అది మన ప్రాణాలకు రక్షణ కవచం" అని ఎస్ఐ సురేష్ సూచించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలతోనే ప్రయాణించాలని, కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని అవగాహన కల్పించారు. వాహన తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖలో చిరిగిన నోట్ల కలకలం..వీడిన మిస్టరి





**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** విశాఖ నగరంలో రోడ్డు పై పెద్ద సంఖ్యలో చిరిగిన కరెన్సీ నోట్లు ప్రత్యక్షమవ్వడం తీవ్ర కలకలం రేపింది. అయితే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో మిస్టరీ వీడింది. బుధవారం ఉదయం సెంట్రల్ పార్క్ (మహాత్మా గాంధీ సిటీ సెంట్రల్ పార్క్) కు ఎదురుగా ఉన్న రోడ్డుపై స్థానిక మార్నింగ్ వాకర్స్ ఈ చిరిగిన నోట్ల కుప్పలను గమనించారు. తెల్లవారుజామునే ఈ నోట్లను చూసిన స్థానికులు ఆశ్చర్యపోయారు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ అప్పల నాయుడు ఆధ్వర్యంలో అక్కడ ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ ఆ నోట్లను ఎవరు పడేశారనే కోణంలో దర్యాప్తు చేశారు. దర్యాప్తులో కేజీహెచ్ ప్రాంతంలోని తాడివీధికు చెందిన ఆదిమూలం సూర్యారావు రూ.50, రూ.20, రూ.10 విలువైన నోట్లను పారేసినట్టు తెలింది. పోలీసులు సూర్యారావు పిలిపించి ఆరా తీయగా సూర్యారావు కిరాణా దుకాణాలకు సరుకులను సరఫరా చేస్తున్నట్టు తేలిందని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంట్లో ఓ అట్ట పెట్టెలో కొంత కాలంగా డబ్బులు, ఎల్ఐసీ రసీదులు ఉంచారు. డబ్బులకు చెదపురుగులు పట్టడంతో ఆయన కుటుంబ సభ్యులకు తెలిస్తే వివాదానికి తావిస్తాదని భావించారు. దింతో మంగళవారం సాయంత్రం సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డు పై నోట్లను సూర్యారావు పడేసినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం సీఐ అప్పలనాయుడు, చిరిగిన నోట్లతో పాటు ఎల్ఐసీ రసీదులు, పాన్ కార్డును సూర్యారావుకు అందజేశారు. నోట్లు వినియోగానికి సరిపోనివని భావించి పడేసినట్టు సూర్యారావు తెలిపారు.

# ఎన్‌బిడబ్ల్యూ ముద్దాయి అరెస్ట్



**భీమునిపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** తన అన్నయ్య ను గాయపరిచిన కేసులో కోర్టు కు హాజరు కాకుండా తపించుకుని తిరుగుతున్న ముద్దాయి కురందాస్ నాయుడుని సీఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో భీమిలి పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసుకి సంబంధించి సీఐ అందించిన వివరాలు ప్రకారం 2022 లో నమోదైన కేసు విషయం లో కోర్ట్ కు హాజరు కాని కురందాస్ నాయుడు పై ఎన్ బి డబ్ల్యూ జారీ కాగా చాలా కాలంగా పోలీసుల కళ్ళు గప్పి తప్పించుకు తిరుగుతున్న కురం దాస్ నాయుడు ని బుధవారం అరెస్ట్ చేసి కోర్టు లో హాజరు పరిచినట్లు తెలియచేసారు.

# సుస్థిర పట్టణాభివృద్ధికి వీఎంఆర్డీఏ కృషి

## గీతంలో వీఎంఆర్డీఏ ఛీఫ్ ఇంజనీర్



**భీమునిపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** ఇంటిగ్రేడెడ్ విధానం మరియు సాంకేతికత ఆధారిత నిర్వహణ ద్వారా భవిష్యత్ తరాలకు అవకాశాలను వనరులను కాపాడుతూ నిర్మించడమే నిజమైన సుస్థిర పట్టణాభివృద్ధి అని సుస్థిర పట్టణాభివృద్ధికి విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజయన్ డెవలప్‌మెంట్ అథానిటీ (వీఎంఆర్డీఎ) ప్రణాళిక యుతంగా కృషి చేస్తోందని ఆ శాఖ ఛీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఇంజనీర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. పట్టణ జనాభా క్రమక్రమంగా వృద్ధి చెందుతూ గ్రామాలతో సమానంగా పట్టణాలు మారుతున్నాయని ఐతే దీని వల్ల మౌలిక సధుపాయాలపై వత్తిడి పెరుగుతోందని ఆయన తెలిపారు. పారిశ్రామికంగా, జనాభా పరంగా విస్తరిస్తున్న విశాఖ నగరం పర్యావరణం, నీటి వనరుల వినియోగం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. విశాఖపట్నం ప్రధాన ఆర్థిక కేంద్రంగా మారబోతోందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధికి ఊతమిచ్చేలా వీఎంఆర్డీఏ ప్రస్తుతం దాదాపు 49 అభివృద్ధి ప్రాజెక్టులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. వీటిలో భాగంగా తెన్నేటి పార్క్ నుండి భీమిలి వరకు 50 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో బే సిటీ ని నిర్మించడానికి ప్రతిపాధనలు సిద్దం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీరింగ్ నిపుణుడు స్వర్గీయ మోక్షగుండం విశ్వేశ్వరాయ విశాఖతో పాటు హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రాలలో అమలు చేసిన పలు ప్రాజెక్టులను వినయ్ కుమార్ వివరించారు. యువ ఇంజనీర్‌లు పరిశీలన, పరిశోధన ద్వారా నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గీతం సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ముకుంద్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ రమేష్, డాక్టర్ చందన కుమార్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండపై పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పరిశీలన : ఈవో జల్లేపల్లి వెంకట్రావు





**సింహాచలం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకట్రావు బుధవారం ఉదయం 7 గంటలకు కొండపై పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ముందుగా గంగధార సమీపంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి గ్రావెల్ పిల్లింగ్ ప్లాంట్, ట్రీ బాక్సుల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అగరబత్తీల తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి, స్వామివారి నిర్మాల్యాలైన తులసి మాలలు, పుష్పాలను సద్వినియోగం చేస్తూ అగరబత్తుల తయారీ జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాల్యాలను మరింత సమర్థవంతంగా సద్వినియోగం చేయాలని సూచించారు. గోకులంలోని గోవుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించిన ఈవో, గో సంరక్షణ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గోవుల సంరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అవసరమైన వైద్య సదుపాయాలను గోశాల వైద్యాధికారితో సమన్వయం చేసుకుని వెంటనే సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. వన్‌స్టాప్ సెంటర్‌లోని ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి, వర్షపు నీరు కౌంటర్లలోకి రాకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే సీసీ కెమెరాల పైన నిర్మిస్తున్న ధర్మకర్తల ఛాంబర్, ఈవో క్యాంప్ ఆఫీస్ పనులను పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. అలాగే ఆర్గానిక్ వేస్ట్ కంపోస్ట్ యంత్రం పనితీరును పరిశీలించిన ఈవో, ఆలయంలో వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దక్షిణ రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను కూడా ఈవో పరిశీలించారు. భక్తులు రాసిన సూచనలు, ఫిర్యాదులను పరిశీలించి, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం భక్తులతో నేరుగా మాట్లాడి దర్శనం, ప్రసాదాల పంపిణీ, ఆలయ సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తులు సౌకర్యాలు బాగున్నాయని చెప్పడంతో ఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, గో సంరక్షణ, నిర్మాల్యాల సద్వినియోగం, అభివృద్ధి పనులకు సమ ప్రాధాన్యత ఇస్తున్నామని ఈవో జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. అన్ని పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.






# రంపులలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

## కుటుంబ సమేతంగా పాల్గొన్న వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలో రంపుల పంచాయతీ పరిధిలోని రంపుల కొత్తవీధిలో వినాయక చవితి నిమజ్జన కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ కుటుంబ సమేతంగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించి నిమజ్జనానికి తరలించారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణనాథుడికి వీడ్కోలు పలుకుతూ కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంకిపాటి గిరి ప్రసాద్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను గ్రామస్తులు ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# వినూత్నంగా వైద్య, ఆరోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



**అనకాపల్లి / చీడికాడ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** కాంట్రాక్ట్ నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మసిస్ట్, పారా మెడికల్ ఉద్యోగుల ఆరు ప్రధాన డిమాండ్స్ ను ప్రభుత్వం నెరవేర్చాలని ఇక్కడి 50పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగులు వినూత్నంగా విజ్ఞప్తి చేశారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సంయుక్త కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు మంగళ వారం సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు ఆసుపత్రి ప్రాంగణంలో తమ రెండు ప్రధాన డిమాండ్లు రంగురంగుల ముగ్గుల రూపంలో వేసి ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, రెగ్యులర్ ప్రక్రియ పూర్తయ్యేవరకు వందశాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ప్రతి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని, కుటుంబం లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇ.పి.ఎఫ్. సౌకర్యం కల్పించాలని, అనారోగ్యానికి గురైన వ్యక్తికి పూర్తి జీతంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మ్యూచువల్ ట్రాన్ఫర్ అవకాశం కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. నినాదాలు పలికారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ అనకాపల్లి జిల్లా కార్యనిర్వా హక కార్యదర్శి కిడారి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ టి ఎస్ కె మదీనా, ఎస్ దేవి, పి దేవి పాల్గొన్నారు.

# గంటా ను కలిసిన జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శోభన్



**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ను జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన ఎం.శోభన్ బాబు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శిగా పని చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా మంచి పేరు తెచ్చుకోవాలని గంటా చెప్పారు. అనంతరం ఆయన్ను శాలువాతో సత్కరించారు. ఫ్యామిలీ కోర్టు ఏపీపీ పార్థసారథి, బుగత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులు లేని గిరిజన గ్రామాలకు తక్షణమే నిర్మాణాలు చేపట్టాలి

## అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు చేరలేక ఇబ్బందులు..ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన టీడీపీ నేత ముక్కలి మహేష్



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలోని గొందిపల్లి, బోనంగిపల్లి, చిన్న అగ్రహారం, వాడమామిడి తదితర గిరిజన గ్రామాలకు ఇప్పటికీ సరైన రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ నేత ముక్కలి మహేష్ తెలిపారు. ఆయా గ్రామాల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో గిరిజనులు నిత్యం అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే ఆయా గ్రామాల్లో రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ బుధవారం ఆయా గ్రామాల గిరిజనులతో కలిసి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహేష్ తెలిపారు. ముఖ్యంగా అత్యవసర అనారోగ్య పరిస్థితులు ఏర్పడినప్పుడు బాధితులను సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు రవాణా సౌకర్యం లేక నరకయాతన అనుభవి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రహ దారి సౌకర్యం లేకపోవడంతో గ్రామాల నుంచి బయటకు రావడం మరింత కష్టంగా మారుతోందన్నారు. వ్యవ సాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు కూడా గిరిజన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలకు, ప్రజలు వైద్య సేవలు మరియు ఇతర అవసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సమస్య పెద్ద అడ్డంకిగా మారిందన్నారు. ఇన్నేళ్లుగా రహదారి కోసం ఎదురు చూస్తున్న గిరిజన గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ముక్కలి మహేష్ కోరారు. ఆయా గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి రహదారి నిర్మాణా నికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల ప్రాథమిక రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణ పనులను తక్షణమే చేపట్టి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గిరిజనులు కోరారు.

# అదృశ్యమైన వ్యక్తి అచూకీ లభ్యం..!



**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** మండలంలోని వెల్లంకి పంచాయతీ గారిపేటకు చెందిన ఇటీవల అదృశ్యమైన వ్యక్తి మురపాల పైడితల్లి (50) ఆచూకీని పోలీసులు బుధవారం కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గారిపేటకు చెందిన పైడితల్లి గత నెల 29న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా కొంత బంగారం తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన ఆయన భార్య పైడమ్మ స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు సీఐ వి.వి.సి.ఎం. ఎర్రం నాయుడు కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తును హెచ్‌సీ వి. శ్రీనివాసరావుకు అప్ప గించారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం పైడితల్లి ఆచూకీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఆయన వెంట తీసుకెళ్లిన బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకుని భార్య పైడమ్మ, ఇతర కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త ఆచూకీని చాకచక్యంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులకు పైడమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

# 43 గ్యాంగ్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన

**అనకాపల్లి / చీడికాడ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం చీడికాడ మండలం అప్పలరాజు పురం గ్రామం లో వినాయకుని నవరాత్రులు లో భాగంగా 43 గ్యాంగ్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు పిఏసిఎస్ అధ్యక్షులు గవిరెడ్డి జగన్నాధం, సీనియర్ నాయకులు గవిరెడ్డి శ్రీనివాసరావు , కురచా సురేష్ , యువ నాయకులు కురచ రమేష్ , కురచా శ్రీను, యువత పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు అందరు సహకరించాలి : ఎంఈఓ సుకుమార్



**అనకాపల్లి / చీడికాడ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** ఓజోన్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి సుకుమార్ కోరారు.. ఓజోన్ దినోత్సవం సందర్భంగా మండలంలో తురువోలు హైస్కూల్ లో విద్యార్థులు పర్యావరణం కాపాడాలని ర్యాలీ నిర్వహించారు.. ఓజోన్ లోగో ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారావు మాట్లాడుతూ మొక్కలు పెంచకపోవడం వలన కాలుష్యం పెరిగి భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర పాడైపోతుందని.. అందుకే సకాలంలో వర్షాలు పడడం లేదని అన్నారు. ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి పి నాయుడు ,సైన్స్ ఉపాధ్యాయులు హారిక,సోమేషు మిగిలిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వృద్ధురాలికి సొంత ఖర్చులతో తాగినీటి సౌకర్యం



**అనకాపల్లి/ చీడికాడ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం,మంచాల మంచాల గ్రామానికి చెందిన 85 దెల్ల కురుందాసు దేవుడమ్మ తన కుమారుడు శ్రీరామ్(65)తో కలిసి నివసిస్తున్నారు, వీరి ఇంటికి తాగునీటి కొళాయి సౌకర్యం లేకపోవడంతో దేవుడమ్మ వయస్సు మీద పడిన కారణంగా నీరు తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన వైసిపి నేత పాటూరి రమణ స్పందించిన పాట రమణ తన సొంత ఖర్చులతో అవసరమైన పైపులు మెటీరియల్ కొనుగోలు చేసి, ప్లంబర్ సహాయంతో ఇంటికి నీటి పైప్లైన్ ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమంలో బొడ్డు రమేష్ పెద్దింటి మహేష్ కొంద్రెడ్డి దేవుడు పాల్గొని సహకరించారు పైపులైను ఏర్పాటు చేసి ఇంటి వద్ద కుళాయి బిగించి నీరు అందుబాటులోకి తీసుకురావడంతో వృద్ధురాలు దేవుడమ్మ ఆనందం వ్యక్తం చేశారు . వయసు మీద పడిన నాకు నీళ్లు తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉండేది, ఇప్పుడు మా ఇంటి వద్దకే నీరు రావడం సంతోషంగా ఉంది అంటూ దేవుడమ్మ ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా తనకు తాగునీటి సౌకర్యం కల్పించిన పాటూరి రమణకు, యువగళం రిపోర్టర్ కు బొడ్డు రమేష్ పెద్దింటి మహేష్ కోనేటి దేవుడు తదితర టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారువృద్ధురాలు ఇబ్బందిని గుర్తించి, ప్రభుత్వ సహాయం కోసం సొంత ఖర్చులతో తాగునీటి సౌకర్యం కల్పించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు

# జీకేవీధి కేజీబీవీ ప్రత్యేక అధికారిణిగా గొర్లె లావణ్య సరస్వతి నియామకం



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** గూడెంకొత్తవీధి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నూతన ప్రత్యేక అధికారిణిగా గొర్లె లావణ్య సరస్వతి నియమితులయ్యారు. నూతన ప్రత్యేక అధికారిణిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు ఆమెకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం లావణ్య సరస్వతి మాట్లాడుతూ విద్యార్థినుల విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను సక్రమంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పాఠశాలలోని అన్ని అంశాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ విద్యార్థినుల విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

# ప్రభుత్వ భూమికి హెచ్చరిక బోర్డు ఏర్పాటు..!!



## ఆనందపురంలో ఆక్రమణల పర్వం..!!

- అడ్డుకట్టపడేది ఎప్పుడు?
- సెలవు రోజుల్లో చకచకా పనులు
- రెవెన్యూ నిర్లక్ష్యంపై మండిపాటు

ఆనందపురం , సెప్టెంబర్ 15 ( మనం న్యూస్ ) : [illegible]

**మనం దినపత్రిక ఎఫెక్ట్**



## కుసులవాడలో కుదేలవుతున్న ప్రభుత్వ భూమి..!!

- అధికారుల హెచ్చరికలు బేఖాతరు
- 20 సెంట్ల విలువైన స్థలంలో యథేచ్ఛగా పాక నిర్మాణం..
- రెవెన్యూ సిబ్బంది లాలూచీ

ఆనందపురం, సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ) : [illegible]

**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** మండలంలోని కుసులవాడలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా పాక ఏర్పాటు చేసిన విషయంపై మనం దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో నరసింహులు బుధవారం సిబ్బందితో కలిసి కుసులవాడలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాకను తొలగించారు. కుసులవాడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 248లో ప్రభుత్వ భూమికి సంబంధించిన సుమారు 20 సెంట్ల స్థలంలో ఇటీవల ఆక్రమణకు ప్రయత్నాలు జరిగిన విషయం అధికారుల దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో స్థలాన్ని పరిశీలించిన అధికారులు అక్కడ ఏర్పాటు చేసిన పాకను తొలగించి, ప్రభుత్వ భూమిలో ఎలాంటి ఆక్రమణలకు పాల్పడ రాదని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించే దుకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని వీఆర్వో నరసింహులు తెలిపారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆక్రమణ జరిగిన ప్రాంతంలో కూడా హెచ్చరిక బోర్డులు పెట్టారు. ఈ బోర్డులు ఎంతవరకు సఫలీకృత మవుతా యోనని పలువురు భావిస్తు న్నారు. ఏది ఏమైనా లేటుగా స్పందించిన రెవె న్యూ సిబ్బంది మరల ఇటువంటి పొరపాట్లు జరగనివ్వకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. తహసిల్దార్ పర్యవేక్షణలో ఉన్నప్పటికీ ఎవ్వరూ ఎక్కడ ఆక్రమణ చేస్తున్నారు, వారికి ఎటువంటి అనుమతులు ఉన్నాయి, సరైన పత్రాలు ఉన్నాయా అనే అంశాలపై క్షేత్రస్థాయి లో పరిశీలించాల్సిన బాధ్యత వీఆర్వోలు మీద ఉంది. అవన్నీ గాలికి వదిలేసి అక్రమార్కులకు కొమ్ము కాయడం పట్ల అందరూ విమర్శిస్తున్నారు.





## పోషకాహారంతో ఆరోగ్యం పదిలం..!



**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** పోషకాహారంతో ఆరోగ్యం, ఆరోగ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.వి.వి. రత్నం అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దిబ్బమీదపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 8 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు అంశాల ఆధారంగా పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఇద్దరు గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. రోజువారీ ఆహారంలో వైవిధ్యం పాటించడంతో పాటు తగినంత ప్రొటీన్లు తీసుకోవాలని, చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారంతో పాటు ఇళ్లలోనూ అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుదినుసులు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం ద్వారా వారికి పోషకాహారంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు అలవడతాయని తెలిపారు. కేంద్రాల్లో పిల్లలకు తాజా, వేడి భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త వై. కనకలక్ష్మి, ఆయా ఆదిలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## బల్లిపురం వినాయకుడికి అన్నదాన విరాళం అందజేసిన తామరబ్బ టీడీపీ బూత్ కన్వీనర్ శెట్టి అప్పలకొండ



**దేవరాపల్లి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** చింతలపూడి సెగ్మెంట్ బల్లిపురం గ్రామంలో కొలువైన శ్రీ శ్రీ సిద్ధి వినాయక ఉత్సవాల్లో తామరబ్బ టీడీపీ బూత్ కన్వీనర్ శెట్టి అప్పలకొండ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈరోజు ఉదయం బల్లిపురం వినాయక మండపం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో శెట్టి అప్పలకొండ స్వయంగా పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీకి తన వంతుగా అన్న సమారాధనకు రూ. 1016 నగదు మరియు 1 రైస్ బ్యాగ్ ను విరాళంగా అందజేశారు.

అప్పలకొండ వెంట చింతలపూడి పంచాయతీ టీడీపీ నాయకులు దాసు రమణ, చింతలపూడి యూత్ యువజన అధ్యక్షులు సావు శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ కార్యదర్శి తామల బుచ్చిబాబు, జంపా కృష్ణ, ఆగరి బంగారు బాబు, గెమ్మెల లక్ష్మణరావు, బల్లిపురం కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ గ్రామ అభివృద్ధికి, భక్తి కార్యక్రమాలకు ముందుండే శెట్టి అప్పలకొండ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ బూత్ కన్వీనర్ గా ఉంటూ గ్రామంలో పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.

# బాలికల రక్షణ, విద్య మరియు సాధికారతపై అవగాహన అవసరం



**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** బాలికల రక్షణ, విద్య, సాధికారతతో పాటు బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల రక్షణ అధికారి కె. హరి కృష్ణ పేర్కొన్నారు. ఈ రోజు 16.09.2026న విశాఖపట్నం మధురవాడ, బక్కన్నపాలెంలోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో జిల్లా బాలల రక్షణ విభాగం మరియు చైల్డ్ హెల్ప్‌లైన్--1098 ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేటీ బచావో -- బేటీ పడావో, బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ హెల్ప్‌లైన్- 1098, ఆత్మహత్యల నివారణ, బాలికల సాధికారత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె. హరి కృష్ణ మాట్లాడుతూ, బాలికల విద్యను ప్రోత్సహించడం,




బాలికల భద్రతను పరిరక్షించడం మరియు వారికి సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాలలపై జరిగే లైంగిక నేరాల నివారణకు సంబంధించిన ఫోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం , విద్యా హక్కు చట్టం మరియు జువెనైల్ జస్టిస్ చట్టం వంటి బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అలాగే, సమస్యలు ఎదురైనప్పుడు పిల్లలు మౌనంగా ఉండకుండా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని, అవసరమైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలను గుర్తించి, అవసరమైన సమయంలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత సేవలను ఆశ్రయించడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని తెలిపారు. తదుపరి జజౌజ సభ్యురాలు శ్రీమతి రాజేశ్వరి మరియు సంగమిత్ర ఫౌండేషన్ ప్రతినిధి శ్రీమతి శైలాబాను విద్యార్థులను ఉద్దేశించి బాలల హక్కులు, బాలికల సాధికారత, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు మరియు బాలల రక్షణకు అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ రఘు, కేస్ వర్కర్లు ఆశాజ్యోతి, ఎల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఆర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. బాలల రక్షణ – మనందరి బాధ్యత. బాలికల విద్య – సమాజ ప్రగతికి పునాది.

# అన్నా క్యాంటీన్ సిబ్బందికి శిక్షణ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** అన్నా కేంటిన్లలో సిబ్బంది పనితీరుపై మెప్మా డిఆర్పీల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్థానిక 35వ వార్డ్ ఫ్రూట్ మార్కెట్ అన్నా కేంటిన్లో డిఆర్పీ చిల్లా జయలక్ష్మి ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరు,వారు ప్రజలతో సత్సంబంధాల నెరపడంపై అవగాహన, కల్పిస్తూ కెపాసిటీ బిల్డింగ్ పై శిక్షణ ఇచ్చారు. అనంతరం స్థానిక కూటమి నాయకులతో కలిసి అన్నా కేంటిన్లో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేద ప్రజల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ చాలా గొప్పదని, సమయానికి నాణ్యత కలిగిన ఆహారం అందిస్తున్నారని ముఖ్యమంత్రికి క్రుతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నా కేంటిన్ల జోనల్ హెడ్ శర్మ, పర్యవేక్షకుడు అప్పలరాజు,35వ వార్డ్ కమ్యూనిటీ



ఆర్గనైజర్ రుప్ప శ్రీధర్,స్థానిక జనసేన నాయకులు లంక త్రినాధరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కండిపల్లి వరలక్ష్మి,బోదల రమేష్,జి.చిన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఓజోన్ దినోత్సవం..!

**ఆనందపురం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓజోన్‌కు సంకేతమైన 'ఓ3' ఆకారంలో విద్యార్థులు నిలబడి ప్రదర్శన నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా ఓజోన్ పొరను కాపాడుకోవచ్చని విద్యార్థులు సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడిశెట్టి రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఓజోన్ పొర సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై జీవరాశులను రక్షించే కవచంలా పనిచేస్తుందని తెలిపారు. ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి




బాధ్యతగా గుర్తించాలని సూచించారు. ఓజోన్ పొరను దెబ్బతీసే సీఎఫ్‌సీ వాయువుల వినియోగాన్ని తగ్గించడంతోపాటు, చెట్లను పెంచడం, కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా, సురక్షితంగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించాలి

## ఉత్సవ కమిటీ సభ్యులు భద్రతా చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి : శ్రీకాకుళం డీఎస్పీ సి హెచ్ వివేకానంద



**శ్రీకాకుళం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ):** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలని శ్రీకాకుళం డీఎస్పీ సి హెచ్ వివేకానంద సూచించారు.శ్రీకాకుళం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం సీఐ పైడపు నాయుడు, వన్ టౌన్ ఎస్ఐ హరికృష్ణ సమావేశం నిర్వహించి ఉత్సవాల సందర్భంగా పాటించాల్సిన భద్రతా చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద కమిటీ సభ్యులు, వాలంటీర్లు అందుబాటులో ఉండి జనసమ్మర్ధాన్ని క్రమబద్ధీకరించడంతో రాత్రి పూట మండపాల వద్ద నిద్రిస్తూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వైర్లు, లైటింగ్ తదితరాలను సురక్షితంగా ఏర్పాటు చేసి, అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మండపాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని, అనుమతి లేకుండా అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని సూచించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మద్యం సేవించి గొడవలకు పాల్పడే వ్యక్తులను అనుమతించరాదని తెలిపారు.విగ్రహ నిమజ్జనం సందర్భంగా పోలీస్, రెవెన్యూ , మున్సిపల్ అధికారులు సూచించిన రూట్, నిమజ్జన ప్రదేశాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణించరాదని, నిమజ్జనం ప్రదేశంలో పోలీసుల సూచనలు పాటించాలని డీఎస్పీ సూచించారు. ముఖ్యంగా చిన్నారులు నీటి ప్రాంతాలకు వెళ్లకుండా తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా నినాదాలు, పాటలు, కార్యక్రమాలు నిర్వహించరాదని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, రెచ్చగొట్టే పోస్టులను నమ్మకుండా ఫార్వర్డ్ చేయరాదని సూచించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన, అనుమానాస్పద వ్యక్తి లేదా వస్తువు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ శాఖకు సహకరిస్తూ వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని శ్రీకాకుళం డీఎస్పీ కోరారు. నిమజ్జన సమయంలో ఎటువంటి మందు గుండు సామాగ్రి, ఫైర్ క్రాకర్స్ వినియోగించరాదని తెలిపారు. ఇదివరకే అనుమతులు పొందిన ఉత్సవాలు రోజులు, నిమజ్జనం సమయంలో ఎటువంటి మార్పుకు లేకుండా నిర్ణీత సమయంలో నిమజ్జనం జరుపుకోవాలన్నారు.

# విశాఖ ట్రాఫిక్ పోలీసులకు 3 స్పీడ్ లేజర్ గన్స్ బహుకరణ

### సేఫ్ జర్నీ అండ్ సేఫ్ వైజాగ్ లో భాగంగా సిఎస్ఆర్ కింద అందజేత - సీపీ శంఖబ్రత బాగ్చి చొరవ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ సేఫ్ జర్నీ అండ్ సేఫ్ వైజాగ్ " కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతకు సంబంధించి నగరంలో అనేక మార్పులు తీసుకువస్తున్నారు. నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న వాహనాల వల్ల ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండగా, కొందరు వాహనదారులు నిబంధనలు అతిక్రమించి అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు, ప్రాణనష్టం జరుగుతోంది. "వేగాన్ని నియంత్రిద్దాం - ప్రాణాలను కాపాడుదాం" అనే లక్ష్యంతో అతివేగ వాహనాలను 24X7 గుర్తించి ప్రమాదాలను నియంత్రించాలనే సంకల్పంతో సీపీని



సౌత్ ఏషియా ఎల్పిజి కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ వారు సంప్రదించి సహృదయంతో సుమారు రూ.18 లక్షల విలువచేసే రెండు స్పీడ్ లేజర్ గన్స్ ను మరియు అదాని గంగవరం పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సహృదయంతో సుమారు రూ.9 లక్షల విలువచేసే ఒక స్పీడ్ లేజర్ గన్ ను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విశాఖ ట్రాఫిక్ పోలీసులకు నేడు అనగా 16-09-2026 న అందజేయడం జరిగింది.

**ఈ స్పీడ్ లేజర్ గన్స్ ద్వారా గుర్తించే ఉల్లంఘనలు:**

1) అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపే వారు 2) హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపే వారు , 3) ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న వారు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం 4) ముగ్గురు ప్రయాణించడం 5) రాంగ్ రూట్ లో వాహనం నడపడం .. ఈ పరికరాలు 300 మీటర్ల దూరం నుండి వాహనాలను గుర్తించి 24ఇ7 ఎన్ఫోర్స్మెంట్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇవి NIC వారిచే అభివృద్ధి చేయబడిన సాఫ్ట్వేర్తో అనుసంధానమై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆటోమేటిక్గా ఈ-చలానా జనరేట్ చేస్తాయి. ఈ కార్యక్రమంలో సౌత్ ఏషియా ఎల్పీజీ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి అండ్ సీఈవో టి ఎస్ ఆర్ డిపార్ట్మెంట్ ఆదాని గంగవరం పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కె ఎస్ ఎస్, ట్రాఫిక్ ఏడీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న కేంద్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల బృందం





**సింహాచలం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన నలుగురు ఉన్నతాధికారుల బృందం బుధవారం దర్శించుకున్నారు. ఈ బృందంలో అలోక్ తివారీ, జాయింట్ సెక్రటరీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ , మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ , గవర్నమెంట్ ఆఫ్ ఇండియా , నిధి అమిత్ సతీజా, ఐఇఎస్ , డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా , దీపక్ సింగ్, ఐఇఎస్ , డిప్యూటీ డైరెక్టర్, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా , రూపాలి, కన్సల్టెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఉన్నారు. వీరికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ జల్లేపల్లి వెంకట్రావు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు మహిమాన్వితమైన కప్పస్తంభమును ఆలింగనం చేసుకున్నారు. తదుపరి అంతరాలయంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించు కున్నారు. స్వామివారి దర్శనానంతరం వేద పండితులు వేద మంత్రోచ్ఛారణలతో వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు శేష వస్త్రంతో సత్కరించబడ్డారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి స్వామివారి ప్రసాదాలను అందజేశారు



# కాశీపురంలో ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవ అవగాహన ర్యాలీ




**దేవరాపల్లి , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయిని రేజేటి సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓజోన్ పొర ఆవశ్యకతను తెలియజేసే ప్రత్యేక అవగాహన సెమినార్ నిర్వహించారు. ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఓజోన్ పరిరక్షణపై ఇచ్చిన సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు. అనంతరం ఉన్నత పాఠశాల నుండి ప్రాథమిక పాఠశాల వరకు ఆర్అండబి రోడ్డు మీదుగా కాశీపురం వీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. "ఓజోన్ పొరను కాపాడుదాం - భవిష్యత్ తరాలను రక్షిద్దాం" అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఉపాధ్యాయులు సుందరి, నారాయణ, రాము, మాధవి, సత్యవతి, పూర్ణిమ, సూర్యప్రభ, కళ్యాణి, జమీమా, ఆశాలత, రాంబాబు మాస్టార్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ పోషణ మాసోత్సవాల్లో వి.మల్లికా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**కూనవరం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు కూనవరం ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధికారిణి వి.మల్లికా పర్యవేక్షణలో నిర్వహిస్తున్న 9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పంద్రాజుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ ఎ. నయోమి రాణి మాట్లాడుతూ.. మునగాకును నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మునగాకులో విటమిన్లు, ఖనిజాలు, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. మునగాకును ఆహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపు, ఎముకల బలోపేతం, రక్తహీనత నివారణ, జీర్ణక్రియ మెరుగుదల వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. అంగన్వాడీ కార్యకర్త ఎం. అరుణ మునగాకుతో వివిధ రకాల పోషకాహార వంటకాలను తయారు చేసే విధానాన్ని తల్లిదండ్రులు, డ్వాక్రా మహిళలకు ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



# జీవీఎంసీ ఎన్నికల సన్నాహాలపై అధికారుల సమీక్ష: గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం

**మధురవాడ , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** జీవీఎంసీ ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా మధురవాడ జోన్ కార్యాలయంలో అధికారుల ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ఏడీసీ) వెంకట రమణ, డీపీవో నాగార్జున పాల్గొని, ఎన్నికల సన్నాహకాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు జోన్ పరిధిలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లు, ఓటర్ల జాబితా పరిశీలన, ఇతర క్షేత్రస్థాయి కార్యకలాపాల ప్రగతిని ఉన్నతాధికారులకు సవివరంగా వివరించారు. అనంతరం, ఎన్నికల సంబంధిత పనుల పురోగతిపై సీనియర్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో, నిబంధనలకు లోబడి అన్ని ప్రాధాన్యత పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

# పింఛన్ల దరఖాస్తు గడువు మరో రెండు రోజులు పొడిగింపు

**విశాఖపట్నం , సెప్టెంబర్ 16 ( మనం న్యూస్ ) :** కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల సమర్పణకు ప్రభుత్వం మరో రెండు రోజులు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ వరకు సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.